
# మంచుపూల వాన

Inspired the 2006 Telugu Telefilm by
the same name.



ఇంటి గుమ్మం ముందు నిల్చుని పర్సు తెరిచాను. కాగితాలు, చిల్లర, పెన్ను, బొట్టు బిళ్ళలు, సేఫ్టీపిన్స్, యిలాచి పొట్లం, పేపర్ నాప్‌కిన్స్, టెలిఫోన్ నెంబర్ల పుస్తకం, లైబ్రరీ ఐడి కార్డు, యేవేవో తగుల్తున్నాయి. తాళాలు మాత్రం తగలట్లేదు.

ఆ అరా యీ అరా వెతుకుతూనే వున్నాను. రోజూ యిదే వెతుకులాట. యిలా వెతుక్కునే ప్రతిసారీ అనుకుంటా తాళాలని యెప్పుడూ వొకే అరలో వుంచాలని. ఆ అరలో వుంచితే అలవాటై గుమ్మం ముందుకు రాగానే చప్పున తాళం తీయవచ్చని. వెతికే ప్రతిసారీ అవిశ్రాంతి.

తాళం చేతికి దొరికింది. తలుపు తీస్తూనే కంపు. అలవాటైన కంపు. మిక్సర్, బూంది, చిప్స్, చికెన్ 65, ఫిష్ టిక్కా. కాగితాలు నూనె కంపు. పులిసిపోయిన లిక్కర్ కంపు. సిగరెట్ల కంపు. బూడిద కంపు. కంపు... కంపు... కంపు... కంపు... కడుపులో దేవినట్టే లేదు... అలసట. వాలిపోవాలి. కాసేపు నిద్రపోతే కానీ యే పనీ చేయలేను. గదిలోకి వెళ్ళాను. ముక్కిన బట్టల కంపు. లైట్ స్విచ్ నొక్కాను.

అసహ్యంగా వెలుగు.

పరుపుపై దుప్పటెక్కడా కనిపించడంలేదు. విడిచేసిన లుంగీలు, టీ షర్ట్స్, తువ్వాళ్ళు – చెల్లాచెదురుగా కుప్పలుగా. తడి కంపు. యెక్కడివక్కడ పారేయలనే లేదు. యెక్కడివక్కడ వుంచుకోవాలని మర్చిపోవటం.

ప్చ్!

గదిలోంచి బయటికి వచ్చేసాను.

కుర్చీలో పేపర్లు పక్కనపెట్టి ఆ కంపులోనే కూర్చున్నాను... మనసంతా నిస్సారంగా, వొక్కసారా రెండుసార్లా... రోజూ యిదే కంపు... యెన్నిసార్లు చెప్పినా పట్టింపే లేదు. లోపల్లోపల అశాంతి.

యెందుకిలా జరుగుతోంది!

యెక్కడుంది మెలిక?

తనెందుకు కనుక్కోలేకపోతుంది!

తామిద్దరూ వొకరినొకరు యిష్టపడ్డారు. యెప్పుడూ కలిసి బతకాలనుకొన్నారు. తామిద్దరి జీవనం పరిమళిస్తుందనుకొన్నారు. కానీ కంపు కొడుతోంది.

యెక్కడ యేం జరిగింది! యే క్రిమి తమ జీవన సారాన్నంతా పీల్చిపీల్చి కంపు కొట్టిస్తోంది! పంటలకి పట్టిన చీడని వదిలించుకోలేక జీవితాలనే వొక్క తాపు తంతున్నారు. ఆ చీడేంటో అర్థంకావడంలేదు. జీవనానికి పట్టిన చీడను అసలు

యెప్పటికైనా వదిలించుకుంటారా?! అసలిది చీడని అనుకొంటున్నామా!

ప్చ్... నావల్ల కావటంలేదు. పారిపోవాలి... బయటపడాలి. యీ అశాంతి నుంచి. గదిలోంచి బయటికి వచ్చి తాళంవేసి మెట్లు దిగుతోంటే వేసి వుంచిన కిటికీ తలుపుల్లోంచి టీవీ ఛానల్స్ శబ్దాలుశబ్దాలుగా. పూర్తిగా కిందికి వచ్చాక యెక్కడికి వెళ్ళాలి. పెద్ద ప్రశ్న. సందేహం. బహుశా జీవితాంతం తోడుండే సందేహం.

వాలిపోయే వాళ్లే తప్పా వాలనిచ్చే వాళ్లేరి?!

నాలుగు అడుగులు వేసానో లేదో పొగ... పొగ... ఆక్సిజన్ అందటం లేదు... క్లీన్... గ్రీన్... శనివారం కదా... మాస్క్... యీ శనివారం కాదు కదా... రోడ్డు దాటి యెటు వెళ్ళాలో తెలియక యిరుకైన ఫ్లైవోవర్‌ని చూస్తున్నా. వొక్క రోజులో పెరిగిన మొక్కలు. రంగురంగుల దీపాలు నడుమ జుమ్మని ఫౌంటేన్‌లో నీళ్ళున్నాయో లేవో!

పొగ... పొగ... పొగ యీ పొగ కంటే యింట్లో కంపే సుగంధంలా తోస్తుంది. తిరిగి యింటికి. రానంతసేపే... రాగానే కమ్ముకొంటున్న అనీజీ.

నూనె మరకల పొట్లాల్ని నమిలి పిప్పిపిప్పగా వదిలేసిన కోడి యెముకల్ని ఖాళీ బీరుసీసాల్ని విస్కీగ్లాసులు వాడేసిన దుప్పట్లని విడిచేసిన బట్టల్ని కాల్చి పారేసిన సిగరెట్టు పీకల్ని చెత్తబుట్టలోనూ సింక్‌లోనూ వేసేసి యిల్లంతా వూడ్చి తడిబట్టతో వొత్తి ఫ్యాన్‌ని కాసేపు పూర్తి స్పీడ్‌లో వేసి... ఆపి... అగరొత్తులు వెలిగించా.

స్నానం చేయడానికి వెళితే బాత్రూమ్‌లో డ్రమ్ ఖాళీ. వుదయం ఆఫీసుకి వెళ్ళే ముందు పూర్తిగా నింపిన డ్రమ్ము. మధ్యాహ్నం అతనూ అతని స్నేహితులూ పూర్తిగా ఖాళీ చేసేశారు. తిరిగి రెండ్రోజుల వరకూ నీళ్ళు రావు. నీళ్ళు లేకపోతే గోలగోల చేస్తాడు. కానీ వొక్కరోజూ తెల్లారగట్ల లేచి నీళ్ళు పట్టిన పాపాన పోలేదు. వంటగదిలోకి వెళ్ళి వంటకోసం పట్టి వుంచిన మంజీరా నీళ్ళు తీసుకొచ్చి తలారా స్నానం చేసాను. చీర కుచ్చిళ్ళు దోపుకుంటుంటే ఆగకుండా కాలింగ్‌బెల్ మోత.

తను తప్ప యెవరూ అంతలా మిస్ బిహేవ్ చేయరు.

తలుపు తీశాను.

గట్టి నవ్వులతో నరేంద్ర.

వెనగ్గా నలుగురు గంజి పెట్టిన నలిగిన తెల్లని యిస్త్రీ చొక్కాలు.

కనుబొమ్మల నడుమ చెమట కారుతున్న కుంకుమ. బీర్ బాటిల్స్ మూట. మిరపకాయ బజ్జీలు. మిక్చర్. లోపలికి వస్తూనే టీవీ ఆన్.

"నమస్తే... వదినమ్మ..." వాళ్ళ పలకరింపు వినిపించనంత త్వరగా దూరంగా లోపలి గదిలోకి వచ్చేసాను. నరేంద్ర నవ్వు, మాటలు గట్టిగట్టిగా.

తలారిపోయింది.

పాటలు వింటూ వంట చేసుకొని యింత తిని నిద్రపోదాం అనుకొన్నా.

యిప్పుడీ కొలువు తెల్లార్లూ.

"మేఘా గ్లాసులు. ఐస్ సోడా వుంది కదా. వోపెనర్," గదిలోకి వస్తూ హడావుడిగా అడిగాడు నరేంద్ర.

ట్రేలో పెట్టి యిచ్చిన గ్లాసులు అందుకొంటూ, "మేఘా... ఫ్రైడ్ ఎగ్స్. డీప్ ఫ్రై," నరేంద్ర బయటికి వెళ్ళిపోయాడు.

అప్పుడేమైనా కాదంటే యిల్లు క్షణాల్లో అరుపుల్తో నిండిపోతుంది.

"మేఘా... కమ్... హియర్... విస్కీ... వోడ్కా..." అడుగుతున్నాడు అక్కడి నుండి...

"మోడ్రన్ కపుల్..." యింగ్లీషు సినిమాల్లాగా, ఆ వచ్చినవాళ్ళ మనసుల్లో కదుల్తున్నవి పైకి వచ్చాయి.

వంటగదిలోకి వచ్చి, "వూ... యేం తీసుకొంటావు," అడిగాడు.

ఫ్రైడ్ ఎగ్స్‌పై పెప్పర్ చల్లి ప్లేట్ అందించా.

"కమ్ మేఘా.... నీ కంపెనీ అంటే నాకిష్టం. రా... మేఘా..."

అవును, వొకప్పుడు తామిద్దరికి వొకరి సాంగత్యమంటే వొకరికి యిష్టం.

అవుట్‌గేట్ దగ్గర కలుసుకునే సాయంకాలానికి మా గుసగుసలతో పూసిన బఠాణీ తీగెలకి పార్క్ హోటల్ వెనక ఆటలకి భీమ్లీ రోడ్డు రెండో మలుపుకి సరుగుడు తోటల నీడల దోవలకి యెర్రమట్టి దిబ్బల మట్టి మెరుపుకి తెలుసు మా యిష్టం.

లైబ్రరీ గోడలకి, నెట్ స్క్రీన్‌కి తెలుసు మా యిష్టం.

యిక్కడ కూర్చోవద్దు, అక్కడ తిరగొద్దనే పోలీసోళ్ళతో గొడవలు.

తూర్పుతీరంలో మా యిరువురి స్పర్శలో యెన్నో వుదయాలు సాయంకాలాలు రాత్రులు మధ్యాహ్నాలు సముద్రం వుప్పొంగి యెగసేది- అమావాస్య కాలమైనా వెన్నెల దినాలైనా కలిసి చదువుకున్నాం. యీత నేర్చుకున్నాం. బీర్ తాగాం. కథలని చదువుకున్నాం. పాడుకొనేవాళ్ళం.

"మనిద్దరం వాళ్ళకి కంపెనీ యివ్వకపోతే బాగుండదు," అన్నాడు.

రూంలోకి వెళ్ళిపోయాను.

స్టేట్ పాలిటిక్స్ ఎన్.డి.ఎ. గవర్నమెంట్... మాటలు అలాఅలా కుటుంబాలు సినిమాలు అమ్మాయిలు. లోపలికి బాగా వినిపిస్తున్నాయి.

అమ్మాయిల విషయంలో చిన్న మాటైనా పొరపాటున దొర్లించేవాడు కాదు. స్నేహంగా వుండేవాడు. యిప్పుడే సంకోచం లేకుండా కొలతలతో తూల్తున్నాడు. అస్సలు భరింపశక్యం కాని విషయం. యెందుకిలా...!

అసలిదంతా యెప్పుడు మొదలయింది? అతనిలో ముందు నుంచి యీ ధోరణి వుందా. తను కనిపెట్టలేకపోయిందా. నో నెవ్వర్... అతనిలో మార్పు...

చదువు అవ్వగానే అతను హైదరాబాదులో చిన్నాన్నగారింటికి వెళ్ళిపోయాడు. తనింకా యం.ఫిల్ అంటూ అక్కడే వుండిపోయింది. జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు. రోజూ బస్సులో వెళ్ళి పాఠాలు చెప్పొచ్చేవాడు. తను అతని దగ్గరికి వచ్చినప్పుడు బంజారా రాళ్ళన్నీ కబుర్లతో నింపేసేవాళ్ళం.

మా యిద్దరం కలిసి వొకే యింట్లో బతకాలనుకున్నాం.

'రిజిస్టర్డ్ మ్యారేజ్,' అన్నాడు.

'యెందుకు'

'నువ్వు వదిలేస్తే'

'ఆ ఆలోచనే వస్తే యే రిజిస్ట్రేషన్ ఆపలేవ్.'

'మా యింట్లో వాళ్ళు అడుగుతున్నారు. నువ్వేం అనుకోకు... వాళ్ళు డబ్బు విషయం మాట్లాడితే.'

'కట్నకానుకలా'

‘అని కాదు యింటికి కావల్సినవి...’

‘నువ్వేం అనుకుంటున్నావ్.’

‘నాకేం లేదు. వాళ్ళ విషయం చెప్పానంతే.’

‘వాళ్ళు వీళ్ళు యేం అనుకోవటం ముఖ్యం కాదు. మనం యేం అనుకొంటు న్నామని.’

‘యింటికి కావల్సినవి అమ్మాయి విషయమని యింట్లో అనుకుంటున్నారు. మీ యింట్లో యేమంటున్నారు,’ అడిగాడు.

‘నువ్వసలు తగిన అల్లుడివే కాదనుకుంటున్నారు.’

అతని ముఖం చిన్నబోయింది. అంతలోనే పౌరుషంగా, ‘నాకేం తక్కువ. అమెరికా వెళ్ళొచ్చు,’ అన్నాడు.

‘వాళ్ళ పొరపాటేం లేదమ్మా. వొకప్పుడు డాక్టర్స్, యింజనీర్స్. యిప్పుడేమో సాఫ్ట్‌వేర్. యిలా అల్లుళ్ళకి గిరాకీ కదా. అమెరికా అల్లుడు అయితే వాళ్ళకీ తృప్తి. మనమేం చెయ్యగలం. అమెరికా యూరప్ మిడిల్ యీస్ట్- ఆఫ్రికా యిలా బోల్డంత ప్రపంచం చూడాలనే వుంది. చూడడానికి వీసా యిస్తారంటావా. మనకి యిష్టమైన ప్రపంచాన్ని చూడాలి. కానీ అదో క్వాలిఫికేషనా కలిసి బతకటానికి.’

‘యిల్లు, సామాను...’ అడిగాడు.

‘మనిద్దరి జీతంతో కొనుక్కుందాం.’

‘చాలాకాలం పడుతుంది కదా. మా యింట్లోవాళ్ళు యేమైనా అనుకుంటారేమో,’ అన్నాడు.

‘వొకపని చేద్దాం. ముందు యింటిని సామానుతో నింపి అప్పుడు బతుకుదాం. యీలోగా నేనొకసారి పాలరాయి కొండల్నుంచి కావేరి ప్రవాహాన్ని చూసొస్తా.’

‘యేంటి తగాదా,’ పక్కని కూర్చుంటూ అడిగాడు సలీల్.

‘యెప్పుడొచ్చావ్,’ అడిగాడు నరేంద్ర.

‘నిన్న వుదయం,’ అంటూ పొడవైన చేతిగుడ్డ సంచిలోంచి మూడు రాళ్ళు తీసి మేఘాకి యిచ్చాడు. సీగ్రీన్ నాచురంగులో వున్న ఆ బుజ్జిబుజ్జి రాళ్ళ నునుపు

తనాన్ని బుగ్గలకి రాసుకుంటూ, 'థాంక్ యూ,' అంది.

టూ బై త్రీ టీ చెప్పాడు నరేంద్ర.

'మంచుకొండలపై నుంచి వెళుతుంటే యెన్నిసార్లు గుర్తొచ్చావో. వచ్చే యేడాది మళ్ళీ వెళదాం,' అన్నాడు సలీల్.

'నే గుర్తు రాలేదా! స్కిన్ టాన్ అయిపోయిందే,' అన్నాడు నరేంద్ర.

'స్నో పడటం చూసావా,' అడిగింది.

'మీరిద్దరూ సీరియస్ చర్చల్లో వున్నట్టున్నారు,' అడిగాడు సలీల్.

'సంసారం...' అన్నాడు నరేంద్ర.

'గుడ్... గుడ్... నా యేరియా కాదు.'

'పెళ్ళి... కలిసుండటం... యేం వద్దా.'

'ప్రస్తుతానికి... అంత ప్రేమేసినపుడు ఆలోచిస్తా. సీ యూ బై...' అని ఆగి గెడ్డాన్ని చేత్తో రాసుకుంటూ మేఘా వైపు చూస్తూ, 'నీకొకటిస్తా నాకేం యిస్తావ్,' అడిగాడు.

'మూడు రాళ్ళు యిచ్చావుగా. యింకా యేం తెచ్చావ్.'

'చెప్పు యేం యిస్తావ్?'

'యేం కావాలి?'

'నీ దగ్గర చాలా ఫ్లూట్స్ వున్నాయి కదా... ఆ బుజ్జి ఫ్లూట్ కావాలి.'

'వూ.'

సంచిలో చేయి పెట్టి వో కాసెట్ తీసి ఆమెకి యిచ్చాడు.

యేంటన్నట్టు చూసింది.

'గొర్రెలు కాసేవాళ్ళు ఆ మంచుకొండల్ని యీ పాటల్తో వెచ్చబరుస్తారు,' చెప్పాడు సలీల్.

సలీల్ వెళ్ళిపోయాడు.

మరో టీ ఆర్డరు చేసారు.

‘చెప్పు యేం చేద్దాం?’ అడిగాడు నరేంద్ర.

‘యీ కేసెట్ విందామా.’

‘తర్వాత. ముందు మన విషయం.’

‘నువ్వేం అనుకుంటున్నావో చెప్పు.’

‘నీ యిష్టం.’

‘యేంటి యింట్లో వాళ్ళ వొత్తిడి యెక్కువగా వుందా?’

‘నీకు లేదా?’

‘ప్చ్! చెప్పానుగా. అమెరికా గ్రీన్‌కార్డ్. నెలకోసారి అమెరికా యూరప్ వెళ్ళా లనుకుంటున్నారు. అన్నయ్య యూరప్, అక్క అమెరికా, నేను అమెరికాలో... వుంటే బాగుండుననిపిస్తోంది వాళ్ళకి. దేశదేశాలు తిరగటం, చూడటం యిష్టమే. కాని అవి స్టేటస్ సింబల్‌గా చూస్తారనుకో యిబ్బందిగా వుంటుంది. యింట్లో అదే చెప్పాను. యిట్స్ వో.కె. అంత తల పట్టుకోవాల్సిన విషయం కాదు. నీ విషయమే అర్థం కావటంలేదు.’

‘యేం లేదు... సో యెప్పుడు కొత్త యిల్లు తీసుకుందాం?’

‘త్వరలో... వెదుకుదాం.’

కాపురం పెట్టిన వేళ మా యిద్దరి జీవితంలో గందరగోళం యేం లేదు.

మా యింట్లో యెటు చూసినా సంతోషమే. వుల్లాసమే. కొద్దిగా వంట సామాను, పరుపు, చాప. పక్కింటి రేడియోలోంచి వినిపించే వివిధభారతి పాటలు. యెన్నో సాయంకాలాలు నడుస్తూ నడుస్తూ యెప్పటికో తిరిగొచ్చేవాళ్ళం. యింటికి కావాల్సినవన్నీ వొక్కొక్కటి మెల్లమెల్లగా యెంపిక చేసి కొనుక్కొనేవాళ్ళం. అనవసరంగా వొక్క చిన్న స్పూన్ కూడా కొనేవాళ్ళం కాదు. వో పొడవైన హాలులో గోడవారగా కేరళా కొబ్బరాకుల చాప. దానిపై బోల్డన్ని బుజ్జిబుజ్జి తలగడాలు. మరో పక్క రంగురంగుల పాత చీరలతో కుట్టిన బొంత. దానిపై రెండు దిళ్ళు. చిన్న ఫ్రిజ్. మ్యూజిక్ సిస్టమ్. సిడిసెట్స్. పుస్తకాలు. చిన్న మట్టికుండలో పెన్. పెన్సిల్స్. అక్కడక్కడా ఆకుపచ్చ సీసాలో నీళ్ళు పోసి ఫ్రెష్ పువ్వుల్ని వుంచేవాళ్ళం.

మా యింటికి యెవరు రావాలి, వచ్చేవాళ్ళు యెవరు అనే విషయంలో చాలా

పట్టింపుగా వుండేవాళ్ళం. జీవనానికి మరింత తడిని, వెలుగుని యివ్వగలిగే స్నేహితులు మా యింటికి రావటానికి యెఫర్ట్ పెట్టేవాళ్ళం. మా సమయాన్ని శక్తులని అర్థవంతమైన స్నేహాలకి వెచ్చించేవాళ్ళం. మా చిన్ని యింటిని కలిసి నిర్మించుకోవడానికి మేమిద్దరం కలిసి శ్రమపడ్డాం. కలలూ కన్నాం. ఆ శ్రమలో ఆనందం ఆశా యింకా తడిగానే వున్నాయి. యిప్పుడా తడి ఆవిరైపోతోంటే బాధ. ఆ ఆవిరిని నిలవరించాలనే తపన.

"రా... వాళ్ళు నువ్వు రాలేదని నొచ్చుకుంటున్నారు. రా..." నరేంద్ర పిలిచాడు.

నిశ్శబ్దం.

అతను వో క్షణం నిలబడి విసురుగా వెళ్ళిపోయాడు.

యీమధ్య తరచుగా యివే గొడవలు.

ఆరోజు సలీల్ వచ్చేసరికి తను వంటగదిలో వంట చేస్తోంది. అతనూ వాళ్ళతో హాల్లో వున్నాడు.

కాసేపటికి, 'బై' అని వినిపించింది సలీల్ స్వరం.

తలతిప్పి చూసింది.

'యింటికి రా,' అన్నాడు.

మౌనం...

'రోజురోజుకీ తన క్వాలిటీ ఆఫ్ లైఫ్ పూర్తిగా యెటో పోతోంది. ది బెస్ట్ అనుకున్న వన్నీ అతన్నుంచి దూరమైపోతున్నాయి. చెప్పలేవా? యెలా వుండేవాళ్ళం యూనివర్సిటీలో. యెవరు వాళ్ళంతా? పవర్‌మనీ కోసం యేమైనా చెయ్యడానికి వెనకాడని వాళ్ళు. వాళ్ళు మన యిళ్ళకి రావటం, మనం వాళ్ళ యిళ్ళకి వెళ్ళటం...'

'నేనెవరింటికీ వెళ్ళలేదు,' చెప్పాను.

'వాళ్ళు యీ యింటికి తరచుగా వస్తున్నారు.'

'యిది మా యిద్దరి యిల్లు.'

'అటువంటి స్నేహాలు చాలా ప్రమాదకరం. వెళ్తున్నా,' సలీల్ వెళ్ళిపోయాడు.

నరేంద్ర జీవితంలోంచి పుస్తకాలు పాటలు మరుగైపోయి చాలాకాలం అయింది.

సలీల్ వొక్కడే అప్పుడప్పుడు వచ్చేవాడు. తనూ చెప్పేసాడు.

అసలిదంతా యెలా మొదలయింది?

ఆరోజు మా యిద్దరం వొకర్నొకరం పెనవేసుకొని గాఢనిద్రలో వున్నాం. ఆగకుండా తలుపు చప్పుడు. మా యిద్దరికీ వొకరినొకరం విడిచి వెళ్ళిపోవాలని లేదు. చాలా అయిష్టంగా తలుపు తీసాను.

నరేంద్రని వెదుక్కుంటూ హఠాత్తుగా వచ్చిన గంగాధర్.

గదిలోంచి వస్తూ, 'యిల్లెలా తెల్సింది' అడిగాడు నరేంద్ర.

'మీ చెల్లెలు యెడ్రస్ యిచ్చింది.'

వాళ్ళిద్దరూ చిన్నతనం నుంచి యింటర్మీడియెట్ వరకూ స్నేహితులు. హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వంటగదిలో ముగ్గురికీ కాఫీ కలుపుతోన్నా. డికాషన్‌లోకి పాలు వంపుతోంటే హఠాత్తుగా పెట్టిన టీవీ శబ్దానికి చేతిలోని పాలగిన్నె అదిరింది.

గంగాధర్ వాల్యూమ్ పెంచుతూనే వున్నాడు.

'యెన్నాళ్ళయిందిరా యిక్కడికి వచ్చి.'

'రెండేళ్ళు.'

'పెళ్ళయి.'

'ఆర్నెల్లు.'యింటిని కలియజూస్తూ, 'వచ్చి రెండేళ్ళయి కూడా సర్కిలేం పెంచుకోకుండా యేం చేస్తున్నావ్...'

అదీ మొదలు.

'మాదాపూర్‌లో సైట్ వుందట కొనుక్కోకూడదు,' అడిగాడో రోజు నరేంద్ర.

'మాదాపూర్‌లో సైట్... అంటే నేల...'

'ఆఁ'

'యెందుకు?'

'ముందుముందు బాగా డెవలప్ అవుతుంది,' అన్నాడు.

‘యిప్పుడు కూడా బానే వుందిగా.’

‘కొనుక్కో.’

‘సైట్ అంటే... సైట్ కొట్టటం అనుకుంటున్నావా యేంటి?’

‘జోక్స్ వద్దు. కొని డెవలప్ చేసి అమ్మాలి. యెన్నాళ్ళిలా... ఆ ప్లేస్ చాలా బాగుంది. అసలా యేరియాలో ఆ లాండ్ దొరకటమే అదృష్టం. పార్టీల దగ్గర అడ్వాన్స్ తీసుకొని డెవలప్ చేయొచ్చు,’ అన్నాడు.

‘అంత అదృష్టవంతమైన లాండ్ నీకెలా తెలిసింది.’

‘గంగాధర్‌కి పార్టీలో తెలిసిన వాళ్ళున్నారు. వాళ్ళు అరేంజ్ చేసారు,’ చెప్పాడు.

‘వాళ్ళకేంటి యింట్రెస్ట్...’

‘కమీషన్ వుంటుంది. మెల్లమెల్లగా అర్థమవుతాయిలే. ముందు సైట్ విషయం చూడు.’

‘నేనా...’

‘వూ... నువ్వే.’

‘అబ్బాయ్ః... అబ్బాయిలకే సైట్ కొట్టటం రాదు. యింకీ సైట్ విషయాలేం తెలుస్తాయి. రేపు సాగర్ వెళదామా.’

‘సైట్ విషయం చాలా సింపుల్. మనీ అరేంజ్ చేయి.’

‘మనీ... నా దగ్గర యెక్కడుంది.’

‘మీ వాళ్ళ నుంచి రావల్సి వుందిగా. అందులోంచి వాళ్ళని కొంత అడుగు.’

బొంతపై పడుకుంటూ గిన్నెల్లో వండుకొంటున్న రోజుల్లో కూడా అతనెప్పుడూ యింట్లోంచి డబ్బులు తీసుకురమ్మని అడగలేదు. యిప్పుడు యింత పెద్ద మొత్తం... దిగులేసింది. యీ ఆలోచనని యిప్పుడే తుంచేయకపోతే చిక్కుల్లో యిరుక్కుంటాం అనిపించింది.

‘నాకే ప్రాపర్టీ పై ఆసక్తి లేదు. వాడను. యెవ్వర్నీ అడిగి డబ్బులు తీసుకురాను. నెలంతా పనిచేసి యెంత సంపాదించగలనో అంతే ఖర్చు చేయటం. అంతకు మించి డబ్బు పరంగా నా నుండి యేం రాదు. నీ విషయం నే చెప్పొచ్చో లేదో

కానీ కలిసి కొన్ని పంచుకున్నాం. కలిసి బతుకుదాం అనుకున్నాం. నీ ఆలోచనలు ప్చ్... నువ్వే కాస్త కూల్‌గా ఆలోచించు...'

ఆరోజు రాత్రి అతను యింటికి రాలేదు. ఆ రాత్రంతా వస్తాడనే చూపులో నిద్ర విరిగిపోయింది. ఆదుర్దా- సతాయింపుగా రాలేదా... లేక యేమైనా అయిందా?

తెల్లారేక తొమ్మిది గంటలప్పుడు వచ్చాడు. ఆఫీసుకి బయలుదేరుతుంటే.

'యేమైపోయావ్ రాత్రంతా'

'సారీ,' అన్నాడు.

'వో.కె. రెస్ట్ తీసుకుంటావా... కాఫీ యివ్వనా...' హేండ్ బ్యాగ్‌ని భుజం నుంచి తీస్తూ లోపలికొస్తూ అడిగా.

'యేం వద్దు. నువ్వు వెళ్ళు,' అన్నాడు.

'వో.కె. బై...' తిరిగి గుమ్మం దాటబోతోంటే 'వాళ్ళకి యేం చెప్పమంటావ్,' అడిగాడు.

'సో... అతను ఫీల్ అయి సారీ చెప్పలేదా... అతని ఆలోచనల్లో మార్పు వచ్చిందను కోగానే కాస్త తగ్గుముఖం పట్టిన అనీజీ తిరిగి సర్రున కమ్ముకొంది.

అతనితో మాట్లాడటమే ముఖ్యమనిపించింది- ఆఫీసుకి వెళ్ళటం కంటే.

'హితబోధలేం వద్దు. డబ్బు విషయం చెప్పు.'

నిర్లిప్తంగా కూర్చుండిపోయాను.

'యివ్వవా...' తిరిగి అడిగాడు.

'అసలు నీ ఆలోచనే యేంటోలా వుంది.'

'అంటే?'

'నువ్వేం అంటున్నావో అర్థం అవుతుంది. కానీ ఆ డీల్ ఫెయిర్ కాదు కదా.'

'నిన్ను డబ్బు అడగ్గానే చాలా చెపుతున్నావ్. బెగ్గర్‌లా కనిపిస్తున్నానా...'

నిశ్శబ్దం.

'వాళ్ళకి మాట యిచ్చాను. నువ్వు నన్ను పరాయిగా చూస్తావనుకోలేదు. మనిద్దరం వొక్కటే అనుకున్నా...'

సాగుతున్న మాటలు.

అచేతనంగా వింటూ.

అతను యింట్లోంచి వెళ్ళిపోయాడు.

రాత్రి రాలేదు. యెక్కడ వెతకాలో తెలియదు. యెవర్ని అడగాలో తెలియదు.

తెల్లార్నే వస్తాడని చూస్తే రాలేదు.

సాయంకాలం అవుతుంటే కాలేజీకి కాల్ చేస్తే వారంరోజులుగా రాలేదని చెప్పారు.

రాకపోతే రాలేదు అనుకోలేక సలీల్ ఆఫీసుకి వెళ్ళాను. చేస్తున్న పని ఆపి బయటకు వచ్చాడు.

క్యాంటీన్‌లో టీ ఆర్డరు చేస్తూ, 'యేమైనా తింటావా...' అడిగాడు.

వద్దన్నట్టు తలాడించాను.

'రెండ్రోజులుగా నరేంద్ర రాలేదు.'

'యెనీ ప్రాబ్లెమ్,' అడిగాడు సలీల్.

'వూ.'

'వస్తాడు... కంగారుపడకు. వెతకనా...'

'యెక్కడని వెతుకుతాం. వారంరోజులుగా కాలేజీకి వెళ్ళలేదు. అతని ఆలోచనల్లో మార్పు వచ్చింది.'

'వాట్స్ ది ప్రాబ్లమ్.'

'అతని చదువుకి తగ్గ వుద్యోగం దొరకలేదు. ఆ కాలేజీలో ఫుల్‌టైమ్ లెక్చరర్ కాదు. తనకి జాబ్ శాటిస్‌ఫాక్షన్ లేదు. చుట్టూ ప్రపంచం చాలా ఆకర్షణీయంగా వుంది. అతనికి క్విక్‌మనీ కావాలని వుంది. సైట్ చూసాను, కొందాం అంటాడు. డబ్బు తీసుకురమ్మంటాడు. యిదీ గొడవ. యెలాగోలా సంపాదించాలనే కోరికకి వచ్చేసాక ఆపలేం కదా.'

'ఫెయిర్ డీల్ కాదనా,' అడిగాడు.

'కాదని తెలుస్తూనే వుంది.'

'మీ వాళ్ళని అడిగితే యిస్తారా...'

'యిస్తారా యివ్వరా అన్నది కాదు ప్రశ్న. అడగను.'

'మీ యిద్దరి మధ్య గ్యాప్ వస్తుందేమో.'

'వచ్చినట్టేగా.'

'యేం చేద్దాం...'

'యింటికి రాకుండా యిలా యెమోషనల్ బ్లాక్‌మెయిలింగ్ చేయటం కష్టంగా వుంది.'

'వెయిట్... చూద్దాం. అతను రియలైజ్ అవుతాడేమో,' అన్నాడతను.

'యెక్కడుంటాడంటావ్.'

'కూల్‌గా వుండు. తనే వస్తాడు,' అన్నాడు సలీల్.

'పదిగంటల వరకు పనుంది. పనయ్యాక యింటికి వస్తా. అప్పుడు మాట్లాడుకుందాం,' అన్నాడతను.

'సరే.'

వారంరోజులు జరిగిపోయాయి. నరేంద్ర యింటికి రాలేదు. ఆదుర్దాతో కళ్ళు తడిసిపోయేవి.

అతని అమ్మగారు, పెద్ద చెల్లెలు భారతి వచ్చారు.

'నువ్వెందుకలా ప్రవర్తిస్తావ్... యేం పట్టనట్టు. వాడితో మాట్లాడి యింటికి రమ్మను,' అన్నారు.

'డబ్బులు లేకపోతే అనుకోవచ్చు. వుండి యివ్వటానికి అభ్యంతరం యేమిటి?' అంది భారతి.

'నా పిల్లలందరిలోకీ వాడు చాలా మంచివాడు. అందమైన ఆడపిల్లల తండ్రులు మంచి కట్నంతో వాడికోసం తెగ తిరిగేవాళ్ళు. డబ్బు మీద వాడికేం ఆశలేదు.

నిన్ను చేసుకుంటానన్నప్పుడు నిజానికి మా యింట్లో యెవ్వరికీ యిష్టం లేదు- నాకు తప్పా. వాళ్ళ అయిష్టమంతా డబ్బు పెద్దగా రాదని. మీవాళ్ళ నుంచి వాడి కొచ్చే సపోర్ట్ కనిపించలేదు. పాలిటిక్స్‌లో మీవాళ్ళు యెవ్వరూ లేరు కదా. అయినా మేం యెవ్వరం పెద్దగా వాడిని కాదనలేదు. నువ్వేమో సామాను కూడా యిద్దరం కలిసి కొనుక్కుందాం అంటావ్ తప్ప ఆస్తిలో నీ వాటా విషయం అప్పుడూ మాట్లాడలేదు. నీకే కాస్త తెలివొచ్చి నీ వాటా అడుగుతావు అనుకున్నాం. కానీ నీకా ధ్యాసే లేదు. నీ వాటాతో వ్యాపారం చేస్తే పెరిగేది నీ ఆస్తే కదా. వాడి ఫ్రెండ్స్, మా బంధువులంతా కూడా యెక్కువగా రియల్ ఎస్టేట్స్‌లో వున్నారు. వాడికీ పదిమందిలో బాగుంటుంది. వాడిని నొప్పించకమ్మా,' ఆంటీ చెపుతూనే వున్నారు.

'మేఘా... యెవ్వరి సంసారల్లో యీక్వల్ రిలేషన్‌షిప్ వుండదు. మగవాళ్ళకి సంపాదించటం, పవర్‌ఫుల్‌గా వుండటం చాలా ముఖ్యం. మొగుళ్ళు పవర్‌ఫుల్ అయితే మన స్టేటస్ కూడా పెరుగుతుంది కదా. మగవాళ్ళ కేంటి మనకీ ఆ రెండూ ముఖ్యమే కదా. మొగుడూ పిల్లలూ కూడా అంతే ముఖ్యం,' అంది భారతి.

'పవర్‌ఫుల్ అంటే...'

'మన పేరు చెబితే వెంటనే గుర్తుపట్టే పరిస్థితి. బోల్డంత డబ్బు. మనం చెబితే పనులవుతాయని, రోజూ పదిమంది మన దగ్గరికి రావటం. స్టేటస్ చాలా ముఖ్యం... అన్నయ్య పైకొస్తే మేం కూడా యిక్కడికి షిఫ్ట్ అవుదాం అనుకుంటు న్నాం. ఫ్లైవోవర్స్ హైవే కాంట్రాక్ట్ తీసుకొన్నవాళ్ళు చాలామంది నరేంద్ర ఫ్రెండ్స్. బంధువులు. సబ్‌కాంట్రాక్ట్ తీసుకోవచ్చు. కాస్త సంపాదించాక హోటల్ స్టార్ట్ చేద్దాం. మనం కూడా ఆ వర్క్సని షేర్ చేయొచ్చు. మనమంతా హేపీగా వుండొచ్చు. వాడికి మనీ యిచ్చి కో ఆపరేట్ చెయ్. ప్లాన్ ఫర్ ఛైల్డ్... అప్పుడు నీ యెనర్జీస్ అన్నీ ఛైల్డ్ పై పెడతావ్. అన్నయ్య పై నుండి నీ అటెన్షన్ తగ్గుతుంది. నీది మంచి జాబే కానీ సంపాదన యెక్కువైతే యెంచక్కా జాబ్ మానేసి యెంజాయ్ చెయ్యొచ్చు కదా...' అంటుంది భారతి.

'యిదంతా మీకు బాగుందా ఆంటీ...'

'సంపాదించటం బాగుంటుంది కదా. సంపాదన లేకపోతే యేం అనుభవిస్తాం. అడ్వర్‌టైజ్‌మెంట్ చూసి మురిసిపోవాల్సిందే. సత్తెకాలపు పిల్లలా వున్నావ్.

మీవాళ్ళు యేం అనుకోరు. అడుగు. నీకు చేతకాకపోతే భారతిని తీసుకెళ్ళు,' నవ్వుతూ తల నిమురుతూ మందలింపుగా అన్నారాంటీ.

నిర్లిప్తం, నిశ్శబ్దం.

'మొగుడూ పెళ్ళాలన్నాక సవాలక్ష వుంటాయిరా... మీ నాన్న అడిగినవన్నీ నే మాత్రం తేగలిగానా... నీలాగే మీ నాన్న అలిగి యిల్లొదిలేస్తే మీ అందరూ యింతింత అయ్యేవారా... యింటికి రా. అక్కడెక్కడో కూర్చుని అదేం సతా యింపు. కావాలని చేసుకున్నావ్. యిందుకేనా... ముందింటికి రా. మనకీ ఆడపిల్ల లున్నారు,' కొడుకును ఫోన్‌లో మందలిస్తూ ఆంటీ.

నరేంద్ర చివరికి యింటికి వచ్చాడు.

చీలిక చీలికే.

సజావుగా మాటలు సాగటంలేదు. మనసులూ కలవటంలేదు. శరీరాలు పెనవేసుకోవటం లేదు.

అతని ఆలోచనలన్నీ యెదగటంపైనే.

అతను సైట్ కొన్నాడు. కాంట్రాక్ట్స్ మొదలుపెట్టాడు.

'డబ్బు యెక్కడిది...' అని అడిగానో రోజు.

'నీకెందుకు,' అన్నాడు.

అతని చూపుల్లో చూపు నిలిపి, 'తెలియాలి నాకు.'

'యెందుకు... యివ్వనన్నావ్. అయిపోయే. యెక్కడిదైతే నీకెందుకు...'

'డబ్బులెక్కడివి...'

'బెగ్గర్‌ని కదా. అడుగుతోంటే యెవరో వొకరు రాలుస్తుంటారు,' హేళనగా అన్నాడు.

నిశ్శబ్దం.

'యివ్వనన్నావ్ కదా, నీకెందుకు నా విషయాలు,' తిరిగి అడిగాడు.

నిస్సహాయం, మౌనం.

'చూడమ్మా. నీ కోడలికి నా గురించి ఆరా అయిపోయింది,' అన్నాడు.

'నీకెందుకమ్మా ఆరా. వాడి గొడవేదో వాడు పడతాడు,' అన్నారామె.

అప్పటికి ఆ సంభాషణ అలా తెగినా ఆ డబ్బులు యెక్కడివని మనసు పీకు తోంది.

యేకాంత సమయాలు అదృశ్యమవుతూ వచ్చాయి. మెల్లమెల్లగా కమ్ముకొంటున్న పరాయితనం. అతన్ని అల్లుకొంటున్న పరాన్నభుక్కులు...

'నువ్వు లేకపోతే అసలు మేం యీ సిటీలో యెందుకూ పనికిరాం. నువ్వు మాకు చాలా చాలా ముఖ్యం,' అంటూ అతని అక్కలు, చెల్లెళ్ళు, బావలు, వారి పిల్లలు మెల్లమెల్లగా యిల్లంతా పాకిపోయారు.

అతను యే తెల్లార్నో యింటికి రావటం, వస్తూనే గదిలో మంచంపై పూర్తిగా వాలిపోయి క్షణంలో నిద్రపోవటం. యింట్లో యెటు చూసినా మనుషులు. తన వాళ్ళ ముందు తాగడు. యింటికొచ్చే అతని తాగే స్నేహితులు తగ్గారు. బయటికి వెళ్ళే అతను యెప్పుడొస్తాడో తెలియదు. యెక్కడికి వెళతాడో తెలియదు. మేం అడిగినా నీకెందుకనే సమాధానం.

ఆరోజు అతను యింటికొచ్చేసరికి వొంటిగంటైంది.

'అన్నం పెట్టనా...'

'తినొచ్చా,' అంటూ భుజాల చుట్టూ చేతులేసాడు. ఆత్రంగా చెవి పక్కన ముద్దు పెట్టుకొని బలంగా దగ్గరికి లాక్కున్నాడు.

వో పక్క బాగా తాగొచ్చిన వాసన. అంత బలాన్ని భరించటం విసుగ్గా వుంటుందని అతనికి తెలుసు. అయినా అతను యిటువంటివన్నీ మరిచిపోయాడు. చలన రహితంగా నిలబడిపోయినా పట్టించుకోకుండా మంచంవైపు లాగి, 'డల్‌గా వున్నావేంటి...' అడిగాడు.

'ప్చ్.'

'చెప్పు.'

అతని చేతుల్ని తప్పించుకొంటూ, 'ప్చ్. చదివిన చదువుకి వుద్యోగాలు లేవ్. కాంట్రాక్ట్ వుద్యోగమైనా వుమెన్ యెంపోర్‌మెంట్ ప్రోగ్రామ్స్ అంటే జాయిన్

అయ్యాను... యిప్పుడేమో వరల్డ్ బ్యాంక్ లోన్ మీద నడిపే ప్రోగ్రామ్‌కి పని చేయమంటున్నారు. ప్చ్! యీ గ్లోబల్ ప్రోగ్రామ్స్ చాలా మంచివని నమ్మి ప్రోగ్రామ్స్ డిజైన్ చెయ్యాలి...' అంది యెదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

'వుద్యోగం మారినప్పుడంతా బాధపడటం నీకో కాలక్షేపం అయిపోయింది. వాళ్ళు చెప్పేది చేసి రావటానికి నీకెందుకంత బాధ... పోనీ అసలు వుద్యోగమే మానై. మనకిప్పుడేం తక్కువ... పోనీ యేదైనా మొదలుపెట్టు...' అన్నాడు నరేంద్ర.

'వ్యాపారం... నా వల్ల కాదు. మరో నచ్చిన వుద్యోగం దొరికేవరకూ యిక్కడే వుండాలి. విశ్వనాథన్ సెన్సిబుల్. లేకపోతే మరీ కష్టంగా వుంటుంది.'

'మీ బాస్ సెన్స్‌బుల్ అంటున్నావ్‌గా. ఆయన చేయటం లేదా. నువ్వే అవీ యివీ వూహించుకొని బాధపడుతుంటావ్. మారే లోకంతో మారాలి. అంతేకాని యిలా బాధపడితే యెలా... గ్లోబల్ డెవపల్‌మెంట్ లేకపోతే నేనింతగా సంపాదించే అవకాశాలు వచ్చుండేవా,' నరేంద్ర చెపుతూనే ఆమె వెనగ్గా నిలబడి వంగి భుజం మీద ముద్దు పెడుతుంటే-

ఆమె చుట్టూ చూస్తుంటే ఆ యింటి నిండా పేరుకొన్న పెద్ద పెద్ద సోఫాలు, పొడవైన డైనింగ్ టేబుల్స్, బరువైన బీరువాలు, కుర్చీలు, వాషింగ్ మెషిన్స్, టివీ, ఫ్రిజ్, పెద్దపెద్ద మంచాలు, ముదురురంగు సిల్క్ కర్టెన్స్... స్టీలు సామాను, గాజు సామాను అవసరమైనవి, కానివి యిల్లంతా యిరుకిరుగ్గా సామాను. అతని డ్రస్, ప్రవర్తనా చివరికి యేకాంత సమయాలలో కూడా కమ్ముకుంటున్న లౌడ్ నెస్... భరించటం కష్టంగా వుంది. యిదంతా శుభ్రం చేసుకోవాలి. మాట్లాడాలి... అనుకుంటూ,

'మనం యెలా వుండబోతున్నాం,' అని అడిగా.

'అంటే...'

'మనిద్దరి సమయం అంటూ యేం కనిపించటం లేదు.'

'మా యింట్లో వాళ్ళు యీ యింట్లో వుండటం నీకిష్టం లేదు కదూ,' అని చప్పున గదిలోంచి బయటికి వెళుతూ, 'వాళ్ళుంటే నీకేమిటంటా,' అని అరుస్తూ యింట్లో అటూ యిటూ తిరుగుతూ, 'రెండ్రోజుల్లో మీరంతా వేరే యిళ్ళకి వెళ్ళి పోండి,' అసహనంగా చెప్పేసాడు.

గదిలో వున్న నాకు వాళ్ళ చూపులు మాటలు తెలియనంత అచేతనం.

వాళ్ళంతా వెళ్ళిపోయారు. వాళ్ళ ఖర్చు అంతా యితను భరించే వొప్పందంతో.

తిరిగి అతని స్నేహితులు- బీర్, విస్కీ, సోడా!.. టి.వి. శబ్దాలు, అరుపులు. కమీషన్ గందరగోళం. అంటే వాళ్ళంతా వున్నప్పుడు రానివాళ్ళు యిప్పుడు రావటం. తిరిగి అతనెప్పుడూ, 'వాళ్ళ వాళ్ళుంటే,' అనే తగాదా యేం పెట్టుకోక పోవటం. అతనికి వాళ్ళని బయట క్లబ్బుల్లో పబ్స్‌లో కలవటం యిష్టం లేదు. విషయాలు పొక్కుతాయనే భయం. వేరే గెస్ట్‌హౌస్‌లు మెయిన్‌టెయిన్ చేసేటంత స్థోమత లేదు. యిల్లయితే బోల్డంత సౌకర్యం.

ఆంటీవాళ్ళని మాకోసం వేరే వుండమనలేదు. అతనికోసం. తన సమయాల కోసం వో స్థలాన్ని యేర్పాటు చేసుకోవటం కోసం. నా మాటలని అవకాశంగా మల్చుకొని పంపించాడు. అతన్ని అతనితో పెనవేసుకుపోయిన అనేక సమయా లని నేనెప్పుడూ తరచితరచి చూడలేదు. అతను నా యెమోషన్స్‌పై ప్లే చేస్తున్నాడని అర్థమవుతున్నకొద్దీ లుంగలుంగలుగా బాధ. ఆఫీసు నుంచి బయటికి వస్తూ బండి స్టార్ట్ చేసాను. యింటికి వెళ్ళాలనిపించలేదు. వుదయం నుంచి మీటింగ్స్ మీద మీటింగ్స్. గాలి ఆడ్డంలేదు. యెట్లైనా వెళ్ళాలి. యింత పెద్ద ప్రపంచంలో మనల్ని మనంగా ఆవిష్కరించుకోగలిగే వొక్క ఆత్మబంధువూ లేకపోవటం నిజమైన వంటరితనం.

వెళుతున్న బండి అప్రయత్నంగా ఆగింది. పార్క్ చేసి యింటి ముందు నిలబడి కాలింగ్‌బెల్ కొట్టాలనిపించక చేత్తో తలుపు తట్టాను.

'యస్ కమిన్.'

లోపలికి వెళ్ళాను.

లో లెవెల్ కుర్చీలో కూర్చుని యంటీవీలో మార్క్‌యాంతోనిని వింటున్నాడు సలీల్. అతని ముందు కూర్చున్నాను. అతని గుండెల వరకు వచ్చిన తలని గుండెలపై ఆన్చాను అలసటగా.

'అలిసిపోయావా బుజ్జమ్మాయ్,' అంటూ మెడ వెనక చేతివేళ్ళతో మెల్లమెల్లగా నొక్కుతూ, 'కాఫీ తాగుతావా,' అని అడిగాడు.

'కాసేపయ్యాక.'

అతని చేతివేళ్ళు నా వీపుపై వెన్నుపూస పక్కగా నిదానంగా నొక్కుతున్నాయి.

అలసట కొద్దిగా తేలికవుతోంటే మూసుకొంటున్న కనురెప్పలు. కాసింత విశ్రాంతి.

అతను కాస్త ముందుకు వంగి తలపై చిన్న ముద్దు పెట్టి, 'యిదేం పెర్ఫ్యూమ్ యిన్ని రకాలుగా వాసనేస్తోంది,' అని అడిగాడు.

'గ్లోబల్... దుబాయ్ మధ్యాహ్నం యిండోనేషియా సింగపూర్ ఆస్ట్రేలియా అమెరికా... వరల్డ్ బ్యాంకు అందర్నీ పెట్టుబడులు పెట్టమని మీటింగ్స్... షాపింగ్ కాంప్లెక్స్, మాల్స్, ఎగ్జిబిషన్స్. పర్చేసింగ్ పవర్. యేసీ హాల్స్ కదా. వొక్కో దేశం వొక్కో పెర్ఫ్యూమ్. అన్నీ కలగలిసిపోయి అతుక్కుపోయి ఆఫీసుకి వెళితే చాలు కలగాపులగపు వాసన. యింటికి వెళితే నానారకాల కంపు. నాకూ రెండూ పడటం లేదు.'

సలీల్ నవ్వి, 'యేం మనవాళ్ళు యిండస్ట్రీస్ పెట్టరంట.'

'ప్రొడక్షన్ పై యెవ్వరికీ ఆసక్తి లేదు. యిన్‌ఫ్రాస్ట్రక్చర్ పెరగాలనుకున్నారు. దానిపై పరుగు. యిప్పుడా పరుగు కాస్త ఆపారు. వాళ్ళకి మన జనాభా ఆకర్షణీయ మైన ఆస్తి.'

'షాపింగ్ మాల్స్... కొంటారా...'

'ఆ... మెల్లమెల్లగా వాటిని చౌకచౌకగా అమ్ముతూ పరిచయం చేస్తారు. విశాలమైన మాల్. చల్లగా లైట్ మ్యూజిక్. పాప్‌కార్న్ తింటూ కోక్ తాగుతూననో, చూయింగ్ గమ్ నములుతూనో సూది నుంచి కారు వరకూ కొనుక్కోవటం బానే వుంటుంది.'

'మనకంటే చిన్న దేశాలని మనమూ కబ్జా చేయమా...'

'నో సలీల్... యెవ్వరికి కూడా మనదేశంలోకి యెవరు రావాలి, యెందుకు రావాలి, వస్తే యేమవుతుంది... యిలాంటి పట్టింపులు లేవ్. కాపిటల్ మూవ్ అవుతుందంటారు... యెలా మూవ్ అవుతుంది! బ్యూరోక్రాట్స్ యిది మంచిదని అనుకున్నారేమో. మెల్లమెల్లగా వాళ్ళలో కొంతమందికి యేం జరుగుతుందో కాస్త కాస్త తెలియటం మొదలుకాగానే యీ పాపంలో భాగం కాకుండా వుండటం యెలాగని తర్జనభర్జన పడుతూ మంచి చేయటానికి ప్రయత్నించటం. మా బాస్ విశ్వనాథ్‌కి పాపం యెప్పుడూ యిదే చింత. ప్చ్! నరేంద్రకి యే చింతా లేకుండా పోయింది. యింటికి యెవరొస్తున్నారనే పట్టింపే లేదు... ప్చ్... బయట

సోకాల్డ్ సాఫిస్టికేటెడ్ కంపు. యింట్లో జిడ్డు కంపు.'

సలీల్ నా నుదుటిపై ఆ కొన నుంచి యీ కొన దాకా చేతివేళ్ళతో చిట్టిగా నొక్కుతూ, 'మార్పు అత్యంత సహజం కదా... నువ్వెందుకలా డిస్ట్రబ్ అవుతావ్...'

ప్రేమ కూడానా... మా ప్రేమ కూడానా... మా యిద్దరి మధ్యా ప్రేమా... మా యిద్దరి వుద్వేగాలూ కలలూ అన్నీ అన్నీ మారిపోవలసిందేనా... కదుల్తున్నాయి నాలో.

'నరేంద్రకి యీ మొత్తం పై అసంతృప్తి వుంది. బాధపడుతున్నాడు,' అన్నాడు సలీల్.

'యే మొత్తంపై...'

'వారం రోజుల క్రితం నరేంద్ర వచ్చాడిక్కడికి.'

'బీర్ కావాలి,' అడిగాడు నరేంద్ర.

చిల్డ్ బీర్ వో సిప్ చేసి, 'యింటికి రావటం లేదేం,' అడిగాడు.

సలీల్ నవ్వాడు చిన్నగా.

ఖాళీ అయిన టిన్‌ని టేబుల్‌పై పెడుతూ, 'నా సర్కిల్స్ రకరకాలుగా పెరుగుతున్నకొద్దీ మా యిద్దరి మధ్యా గ్యాప్ పెరుగుతోంది. యెదగాలనుకున్నాను. వున్నదంతా నాన్న ఆదర్శాలకే ఖర్చు అయింది. సిటీబస్‌లో వేలాడిపోతూ ప్రయాణం నుంచి జీవితం యేసి కారు వరకు వస్తే తనకి నా పట్ల వ్యతిరేకత. యింతవరకూ నా కారు యెక్కలేదు. వో చోట లంచం యిస్తా. మరోచోట తీసుకుంటా. నా చుట్టూ వున్న సర్కిల్‌కి ట్రేసి, చామ్స్కీ, సోమాలియా, సిమోన్ డే బిహేవియర్ తెలియకపోవచ్చు. వాళ్ళు తెల్సిన సర్కిల్‌కి యీ రోజేంటి చాలా కాలంగా వుద్యోగాలు లేవు. వాళ్ళని అడ్డంగా పెట్టుకొని బతకట్లేదా... అదంతా న్యాయ సంపాదనే... యెక్కడా... యెక్కడా... వొకప్పుడు మనం కలగన్న ప్రపంచం జీవితం లేదు. మారక తప్పదు... డబ్బు అడిగా... తనని... తప్పే... యివ్వొచ్చుగా... మా యిద్దరం వొకటే కదా. నీది నాది తనది కాదు. అంతా మనది అని నమ్మే అడిగా... వూహుఁ... యివ్వలే... పడిందో బంగారుచిలక... పెళ్ళి పెళ్ళి అంటుంది. కానీ నేనే మేఘూకి అన్యాయం చేయదల్చుకోలేదు. మేఘుకి జీవితం అర్థంకాదు. నా చదువుకి తగ్గ వుద్యోగం రాదు. వాడికిందా వీడి కిందా చిన్న వుద్యోగాలు

చేయలేను. తెలివుంది కలిసొచ్చింది. పైకొచ్చాను. కాని మేఘాకి యివేమీ పట్టవు. నేనేదో ఘోరం చేసినట్టు యీ డబ్బు ముట్టదు. మా యింట్లో అందరికీ నేను చేసేవన్నీ నచ్చుతాయి. వోన్ చేసుకుంటారు. కానీ మేఘా అలా కాదు. వొక్కసారి కూడా... ప్చ్...' నాలుగో టిన్ కూడా పూర్తయి పోయింది. అయిదో టిన్ తెరచి కాస్త తాగాడు. సెల్ తీసి నెంబర్స్ నొక్కాడు.

'హా... నేను నరేంద్రని... బీరు తాగుతున్నా... చూడు రత్నా... మీ సెక్రటరియా... పర్మిషన్... ప్చ్... చూడమ్మాయి... యెంత బాగా నవ్వుతావ్... డబ్బులేగా... నీవి యిచ్చేస్తా... మొత్తం... ఆ కనకాంబరం చీరలో చాలాచాలా అందంగా వున్నావ్... నీ వాయిస్ వినాలనిపిస్తోందమ్మాయ్... మాట్లాడమ్మాయ్...' అలా వో గంట సాగింది సంభాషణ...' అన్నాడు సలీల్.

చిన్నగా నవ్వి, 'ఆకలి' అన్నాను.

'మాట్లాడటం నీకిష్టం లేదని తెలుస్తోంది. కానీ తనని బాగు చేసుకోరాదు,' అన్నాడు సలీల్.

'యెలా, యెందుకు...'

'యెలాగోలా... అతని రిక్వైర్‌మెంట్ తెలిసిందిగా... సాటిస్‌ఫై చేయకూడదా.'

'యెందుకు...'

'మీ మధ్య గ్యాప్ తగ్గుతుందేమో.'

తిరిగి చిన్నగా నవ్వుతూ, 'ఆకలి' అన్నాను.

'యింత సీరియస్ విషయం మాట్లాడుతోంటే.'

'చూడు సలీల్... మారటం బాగు చేసుకోవటం యిదంతా అవ్వదు. వొకప్పుడు మా యిద్దరం బై ఆల్ మీన్స్ వొకరికొకరం కావాలనుకొని వో డిఫైన్డ్ రిలేషన్‌షిప్ లోకి వచ్చాం. యీరోజు మారిపోయాడని నేనూ- మారలేదు తనూ అని అతను అనుకుంటున్నాం. యిట్స్ వో.కె. యిన్ ప్రిన్సిపుల్ తేడాలొచ్చాయి. నీకూ అతని పంథా నచ్చలేదు. స్నేహితుడివి కాబట్టి మెల్లగా తప్పుకున్నావ్. కానీ భార్యని కాబట్టి అతని రిక్వైర్‌మెంట్‌ని సంతృప్తి పర్చమంటున్నావ్ కదా...'

'సారీ,' నొచ్చుకుంటూ అన్నాడు.

'యిట్స్ ఆల్‌రైట్. నిజంగానే ఆకలేస్తోంది.'

అతను ఫ్రిజ్ తెరిచాడు.

ఖాళీ...

'బయటికి వెళదామా?' అడిగాడు.

'వెంటనే, ఆకలేస్తోంది.'

యింటికి వచ్చేసరికి నరేంద్ర హాల్లో కూర్చుని వున్నాడు. టివి వైపు నుంచి చూపు తిప్పి, 'యెక్కడికి వెళ్ళావ్. నీకోసం యెప్పట్నుంచో యెదురు చూస్తున్నా. యింటి కొచ్చేసరికి నువ్వు లేకపోతే భలే బోర్ కొడుతుందనుకో...'

యేదైనా అవసరం వుంటే యిలా మాట్లాడటం అలవాటే.

'సలీల్ యింటికి.'

'వూహూం... రేపు మా కొత్త వెంచర్ స్టార్ట్ చేస్తున్నాం... యం.ఎల్.ఎ.గారు, మంత్రిగారు వస్తున్నారు,' అన్నాడు.

'వూ.'

అతను నా దగ్గరికి వొచ్చి మెడ చుట్టూ చేతులేసి చప్పున వీపు మీద వేళ్ళతో నిమురుతూ భుజంపై ముద్దు పెట్టాడు. చాలాకాలం తర్వాత స్పర్శించటం. ఆ స్పర్శలో బోలుతనం నాలోకి పాకుతోంది. సెల్ మోగింది. అతని చేతులు సెల్ వైపుకి. అక్కడే నిలబడి వున్నాను.

మాటలయ్యాక, 'రేపు వుదయమే ఆరున్నరకల్లా బయలుదేరాలి,' అన్నాడు.

యేంటన్నట్టు చూసాను.

'కొత్త వెంచర్ ప్రెస్టీజియస్ వెంచర్,' అన్నాడు.

'నేనెందుకు.'

'జస్ట్ లైక్ దట్,' భుజాలని యెగరేస్తూ అన్నాడు.

'వీలవ్వదులే.'

'యేం యెందుకని...'

‘ఆఫీసుకెళ్ళాలిగా.’

‘ఛా... లీవ్ పెట్టు. అయినా నీదేం పర్మినెంట్ జాబ్ కాదుగదా. కాంట్రాక్ట్ జాబేగా,’ అన్నాడు.

యెప్పటిలా మౌనం.

‘రేపు మనం వెడుతున్నాం.’

‘యెందుకలా పట్టుబడుతున్నావ్.’

‘పూజుంది. పీటలపై మనిద్దరం కూర్చోవాలి.’

‘నీకు తెలుసుగా... నాకవన్నీ అలవాటు లేవని.’

‘అన్నీ అలవాటైతేనే చేస్తామా! నాకు మాత్రం యింతకు ముందు అలవాటుందా... యిప్పుడు కదా బాగా అలవాటైంది. రానంటే యెలా... నీ పెళ్ళాం యేదంటే యెవర్ని చూపాలి. నీకు అసూయ... రావొచ్చుగా...’

‘స్టాప్ యిట్... మరీ మనం యిలా మాట్లాడుకోద్దు. యిష్టం లేదు. అంతే.’

‘యెందుకు...’ అడిగాడు.

‘నీ బిజినెస్‌లోకి నువ్వు డబ్బులు తెచ్చిన పద్ధతి, ఆ వ్యాపారంలో నువ్వు ఆపరేట్ చేస్తున్న పద్ధతి నాకు నచ్చలేదు. మనిద్దరం యీ యింటికి యెవరు రావాలి అనే విషయంపై చాలా పట్టింపుగా వుండేవాళ్ళం. వొకే యింట్లో జీవితాలని పంచుకోవాలనుకున్న వాళ్ళం. నీ జీవితంలో వో ముఖ్య పార్శ్వంతో నాకే సంబంధం లేదనుకోలేను. నీ పనులు నువ్వు చేసుకుంటున్నావ్. నన్నందులోకి లాక్కు.’

‘నీ డబ్బేం కాదుకదా. నచ్చి యిచ్చినవాళ్ళనంటావేం,’ అన్నాడు.

‘నువ్వు చేస్తున్నదేంటో నాకు తెలుసు. యెందుకీ మాటలు. మరింతగా మనిద్దరం మనకిష్టంలేని మన గురించి మాట్లాడుకోవటం.’

‘నువ్వంటే నాకు యిష్టం. రత్న యెన్నిసార్లు అడిగినా పెళ్ళికి వొప్పుకోలేదు. నీకేం అర్థంకాదు,’ అసహనంగా అన్నాడు.

అసహన నిశ్శబ్దం.

'రత్న మొగుడూ రత్నా విడిపోయి చాలాకాలం అయింది. గంగాధర్‌కి చుట్టం. డబ్బుంది. యిచ్చింది. నేనంటే యిష్టం. పెళ్ళి చేసుకుందాం అంది. కానీ నేనెప్పుడూ యస్ చెప్పలేదు,' అన్నాడు.

'నో అని కూడా చెప్పలేదు. పెళ్ళి లాంటిదేదో ప్రామిస్ చేసాకే డబ్బిచ్చారను కుంటా.'

'యేదో చెప్పానులే... తన డబ్బులు తనకి ఇచ్చేస్తాగా,' తేలిగ్గా అనేస్తూ, 'రేపు రానని అనకు. మంత్రిగారి భార్య, ఎం.ఎల్.ఎ.గారి భార్య వస్తున్నారు. నువ్వు రాకపోతే బాగుండదు,' అన్నాడు.

'రాలేను. అసలు మనమిలా కలిసి బతకడంలో అర్థమేమైనా వుందా'

'ఛ... ఛ... నేను యింట్లో వుండను వెళ్లిపోతా.'

'కాస్త సహనంతో చెప్పేది విను. యింట్లోంచి వెళ్ళిపోవటాలూ యీ గందర గోళాలేం వద్దు. నిజానికి మనం యింక యీ విషయం గురించి మాట్లాడుకోవటం మంచిది. మనం కలిసి నడుద్దాం అనుకున్నాం. కొంతకాలం నడిచాం. అంతే. కలిసి నడవటం మానేసి చాలాకాలం అయింది.'

'అంటే విడిపోదామనా.'

'మనం విడిపోయి చాలాకాలం అయింది.'

'నాకు రత్నకి మధ్య...'

ఆమె అవిశ్రాంతంగా నవ్వి, 'రత్నా... గంగాధర్... నువ్వూ... ప్చ్ వీళ్ళెవరూ కాదు మన సమస్య. ఆ విషయాలు యింక వదిలేద్దాం. మనం నమ్మిన వాటికి పక్కకి జరగడానికి యిద్దరం సిద్ధంగా లేం. కాస్త ప్రశాంతంగా విడిపోదాం.' యిల్లంతా కలియతిరుగుతున్న చూపులు. పంచుకొన్న క్షణాలు... పొదువుకొన్న జ్ఞాపకాలు... నిర్విరామంగా వెంటాడుతోంటే వూపిరి చిక్కుకుపోయింది.

'సరే చెప్పు. సామాన్లు యెలా పంచుకొందాం,' అన్నాడు.

'చెప్పు.'

'మనిద్దరం కలిసి కొన్నవి పంచుకొందాం. నే కొన్నవి యెలాను నీకొద్దు కదా.'

నవ్వాను.

గిన్నెలు, తపేలాలు, దుప్పట్లు, తలగడాలు అతనే వంతులు వేసేశాడు.

మా యిద్దరి చూపులు ఆ వొకే వొక్క బొమ్మపై నిలిచిపోయాయి.

కృష్ణుడు, సత్యభామను ప్రేమగా వొకర్నొకరు చూసుకొంటున్న పాలరాయి బొమ్మ. అరుదైన ఆ బొమ్మని జైపూర్ వెళ్ళినప్పుడు యిద్దరం ముచ్చటపడి కొన్నాం.

యెవరు తీసుకోవాలి!

చివరికి అతనే అడిగాడు, 'యెవరు తీసుకొందాం.'

నేనేం మాట్లాడలేదు.

'టాస్ వేద్దామా' అడిగాడు.

'వద్దు. నువ్వు తీసుకో,' అన్నాను.

యిద్దరం తీరిగ్గా గోడలకి అమర్చుకొన్న ఫోటోలను వొక్కో మేకు నుంచీ తీస్తుంటే మనసు గిలగిలలాడింది.

మా యిద్దరి సాంగత్యంలో అత్యంత మానవీయ క్షణాలవి. స్నేహాన్నీ, ప్రేమనీ చూసిన నాకు యీ మొత్తం సంఘటన కాలుస్తోంది. అగ్ని ప్రవాహంలా దహించి వేస్తోంది. కలిసి యే సమయాలనీ గడపకపోతే యే విషయాలనీ పంచుకోకపోతే ఆ స్నేహానికీ ప్రేమకూ అర్థమే లేదు. యిష్టాలు మారాయి. అసలు యింత ప్రేమ గాయపడటానికేనా... తప్పదు.

అవే సూర్యోదయాలు, సాయంకాలాలు, చంద్రోదయాలు, అమావాస్య దినాలు, వరదలు, చలిగాలులు, వడగాల్పులు...

థింక్ గ్లోబల్ యాక్ట్ లోకల్... కాన్ఫరెన్స్‌లో విశ్వనాథ్ మాట్లాడుతున్నాడు వింటున్నంతసేపు అనీజీ.

'యీ పని నుంచి తప్పించి వేరేచోట వేయండి,' విశ్వనాథ్‌ని అడిగాను.

'యెక్కడికి వెళ్ళినా యివే కాన్సెప్ట్. మెల్లమెల్లగా యీ మొత్తం యిష్యూని మన వాళ్ళకి యెక్కువ హాని చేయకుండా యెలా డీల్ చేయాలో ఆలోచించడానికి నీలాంటి వాళ్ళుండాలి,' చెప్తున్నాడు విశ్వనాథ్.

'యేంటి ఆలోచిస్తున్నావ్' అడిగాడతను.

'యివేం వద్దు.'

'యేం చేస్తావ్.'

'చదువుకోవాలని వుంది.'

'యేం చదువుకొంటావ్.'

'చరిత్ర.'

'హిస్టరీ...'

'ఆఁ'

'చదివేం చేస్తావ్.'

'వెతుకుతాను.'

'యేంటి?'

'మమ్మల్ని... మనల్ని... నన్ను నేను... మనందర్నీ...' కదుల్తున్నాయి.

ఆమె చూపులు అతని టేబిల్‌పై వున్న వెడ్డింగ్ కార్డ్‌పై ఆగాయి.

'నరేంద్ర పెళ్ళి. యింట్లో వాళ్ళు కుదిర్చిన పెళ్ళి. శ్రీవిద్యా వెడ్స్ నరేంద్ర. నరేంద్ర వెడ్స్ శ్రీవిద్య అని రెండు కార్డ్సు వచ్చాయి,' అన్నాడు.

✦

'గుడ్.'

బేగేజ్ సెక్యూరిటీ చెక్‌కి పంపించి సలీల్ దగ్గరికి వచ్చాను.

'థాంక్ యూ... నువ్వూ విశ్వనాథ్ పూనుకోకపోతే యింత త్వరగా చదువుకొనే అవకాశమే వచ్చుండేది కాదు,' చెప్పాను.

'నాకేం తెస్తావ్...' అడిగాడు.

'మంచు.'

'నో... నార్త్ అమెరికా కదా,' అన్నాడు.

'చదువు పూర్తిచేసి వెనక్కి వస్తూ హరప్పా మెహంజదారో చూడాలి,' అన్నాను.

'యిక్కడికి రా. నాక్కూడా చూడాలని వుంది. కలిసి వెళదాం. సింధూనదిని చూసొద్దాం,' అన్నాడు.

'వో... గుడ్...'

అనౌన్స్‌మెంట్...

వంగి హేండ్‌బ్యాగేజ్ అందుకొంటూ అతని మెడ చుట్టూ చేయి వేసి దగ్గరికి జరిగి బుగ్గపై ముద్దు పెట్టుకొని చిన్నగా నవ్వాను. నా మెడ వెనుక చేతివేళ్ళతో చిన్నగా నొక్కుతూ అతనూ నవ్వాడు.


ఆ నవ్వుల్లోంచి లీలగా వినిపిస్తున్న అనౌన్స్‌మెంట్.

'నిజంగా మంచుని తెస్తావా'

'వూహూ... మంచుపూల వానల్నే తీసుకొస్తా...'

'మనకోసం,' యిష్టంతో స్పష్టంగా అడిగాడు.

అతని అరిచేతిని ముద్దు పెట్టుకొన్నా. అతను నవ్వాడు జల్లులుజల్లులుగా మంచు పూలవానలా...



*ప్రస్తానం సాహిత్య ప్రత్యేక సంచిక*
*2002*